
ఓ చిన్నారిని ముద్దాడుతూ..



చంద్రబాబుకు జ్ఞాపిక బహూకరిస్తున్న చంద్రశేఖర్


కార్యకర్తలకు అభివాదం


చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు వచ్చిన కార్యకర్తలు


గజమాలతో సత్కారం

చెన్నైలో చంద్రోత్సాహం

ఐఐటీలో ఉరకలేసిన ఉత్సాహం

- విమానాశ్రయం వద్ద ఘనస్వాగతం
- రోడ్డుకిరువైపులా కార్యకర్తల నినాదాలు

చెన్నై, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మద్రాస్' (ఐఐటీఎం)లో జరిగిన 'ఆలిండియా రీసెర్చ్ స్కాలర్స్ సమ్మిట్-2025'లో పాల్గొనేందుకు శుక్రవారం చెన్నై వచ్చిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుకు పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో ఉదయం 12 గంటల ప్రాంతంలో చెన్నై విమానాశ్రయం చేరుకున్న చంద్రబాబుకు చెన్నై టీడీపీ అధ్యక్షుడు డి.చంద్రశేఖర్, ఏపీ ప్రభుత్వ విప్, గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే వీఎం థామస్, టీటీడీ చెన్నై సలహా మండలి మాజీ అధ్యక్షులు ఎన్.శ్రీకృష్ణ, జి.మోహన్, మన్నూరు చలపతి, ఐ.ఉమాపతి, ఎం.రవిబాబు, కొల్లూరు రాజేంద్ర నాయుడు, జనార్దన్, నారాయణ, శ్రీనివాస్, కాట్రగడ్డ ప్రసాద్, రవీంద్రనాథ్ చౌదరి, మాజీ ఎమ్మెల్యే హేమలత, కృష్ణరాయల్, శిల్పాహరి, బిల్డర్ గంగాధరన్, బీజేపీ సీనియర్ నేత శంకర్ తదితరులు సాదర స్వాగతం పలికారు. కాగా వందలాదిమంది కార్యకర్తలు టీడీపీ జెండాలు పట్టుకుని విమానాశ్రయం వెలుపల రోడ్డుకిరువైపులా నిలబడి చంద్రబాబుకు జయజయధ్వానాలు పలికారు. చంద్రబాబు వారికి అభివాదం చేస్తూ ముందుకు కదిలారు.


ఐఐటీఎం కార్యక్రమంలో ప్రొఫెసర్లు, విద్యార్థులు

ఐఐటీఎంలోనూ అదే సందడి

ఐఐటీఎంలో జరిగిన 'ఆలిండియా రీసెర్చ్ స్కాలర్స్ సమ్మిట్-2025'కు విచ్చేసిన చంద్రబాబుకు అపూర్వ స్వాగతం లభించింది. సదస్సు హాలులో అడుగుపెట్టినప్పటి నుంచి ఆయన ప్రసంగం ముగించుకుని వెళ్లేంతవరకూ పరిశోధక విద్యార్థుల్లో ఉత్సాహం పెల్లుబుకింది. 'జై బాబు జైజై బాబు' అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. ఐఐటీ మద్రాసుకు చెందిన పరిశోధక విద్యార్థులతోపాటు దేశం నలుమూలల నుండి వచ్చిన పరిశోధకులతో హాలు నిండిపోయింది. నిర్దేశిత కార్యక్రమం ప్రకారం చంద్రబాబు 11 గంటలకు రావాల్సి ఉండగా 12.30 గంటలకు ఆలస్యంగా చేరుకున్నారు. చంద్రబాబు లేటుగా వస్తున్నారని తెలిసినా విద్యార్థులంతా ఆయన కోసం ఎదురూ చూశారు. చంద్రబాబు వేదిక వద్దకు వస్తున్నారని సమాచారం తెలియగానే ఒక్కసారిగా సభా ప్రాంగణం విద్యార్థుల ఈలలు, కేకలతో దద్దరిల్లింది. ఇక ఐఐటీఎం డైరెక్టర్ కామకోటి విద్యార్థులు చంద్రబాబు పట్ల చూపుతున్న ఉత్సాహాన్ని చూసి తన అధ్యక్షోపన్యాసాన్ని రెండు మూడు వాక్యాలతో ముగించారు. 'ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు ఓ రాష్ట్రాన్ని పునర్నిస్తున్న మహానాయకుడికి ఘనస్వాగతం' అంటూ పేర్కొన్నారు. ఇక సదస్సులో ప్రసంగం చేస్తున్నప్పుడు, ఆ తర్వాత విద్యార్థులు ప్రశ్నలడుగుతున్నప్పుడు కూడా బాబు నవ్వుతూనే ఉన్నారు. ఐఐటీఎంలో 40 శాతం వరకు తెలుగు విద్యార్థులున్నారని తెలుసుకుని ఎంతో సంతోషించానని బాబు చెప్పగానే విద్యార్థులు చప్పట్లు చరిచారు. అదే విధంగా ఆంగ్ల ప్రసంగంలో ఐఐటీ మద్రాసులో చదువుతున్న విద్యార్థులు కొత్త పరిశోధనలతో తమ రాష్ట్రానికి వస్తే వారిని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా మారుస్తానని చెప్పినప్పుడు కూడా చప్పట్లు చరిచారు. తెలంగాణాకు చెందిన సృజన అనే విద్యార్థిని అడిగిన ప్రశ్నకు బాబు తెలుగులోనే సమాధానం చెబుతూ ప్రస్తుతం శాస్త్ర సాంకేతిక రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయని ప్రతి వ్యక్తీ ఐటీతో పాటు ఏఐ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్)ను కూడా ఉపయోగించాలని సూచించారు.

ఐఐటీఎంలో పలువురు ప్రముఖులతో భేటీ

ఐఐటీఎం సదస్సు ముగియగానే అక్కడున్న గెస్ట్ హౌస్‌లో చంద్రబాబు పలువురు ప్రముఖులతో భేటీ అయ్యారు. ఇందులో వివిధ రంగాలకు చెందిన వారు కూడా వున్నారు. టీటీడీ చెన్నై సమాచారకేంద్ర సలహామండలి మాజీ అధ్యక్షుడు శేఖర్ రెడ్డి కూడా చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం చంద్రబాబు సాయంత్రం 5.45 గంటల ప్రాంతంలో ప్రత్యేక విమానంలో విజయవాడకు బయలుదేరి వెళ్లారు. చంద్రబాబు రాక సందర్భంగా విమానాశ్రయం నుంచి ఐఐటీఎం వరకు పటిష్టమైన భద్రత ఏర్పాటు చేశారు.

అసెంబ్లీలో రగడ

- సభ నుంచి ఒకరోజు అన్నాడీఎంకే ఎమ్మెల్యేల సస్పెన్షన్

ప్యారీస్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ హాలులో శుక్రవారం సభాహక్కులను ఉల్లంఘించి రగడ చేశారనే ఆరోపణల నేపథ్యంలో అన్నాడీఎంకే సభ్యులను గెంటివేయాలంటూ ఆదేశించిన స్పీకర్ అప్పావు.. ఒక్కరోజు పాటు వారిని సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. శుక్రవారం ఉదయం ప్రశ్నోత్తరాల సమయం ముగిసిన వెంటనే ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిస్వామి ఏదో ఒక అంశంపై మాట్లాడేందుకు ప్రయత్నించారు. వెంటనే జోక్యం చేసుకున్న స్పీకర్ అప్పావు మాట్లాడదలుచుకున్న అంశాన్ని అరగంట ముందుగా తనకు సమాచారం ఇవ్వాలని, దానికి విరుద్ధంగా వ్యవహరించడం సరి కాదని ఈపీఎస్‌కు సూచించారు. దానికి అభ్యంతరం తెలిపిన అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు సభలో లేచి కేకలేశారు. ఈపీఎస్ మాట్లాడేందుకు మళ్ళీ ప్రయత్నించగా, ఆయన్ని వారించిన స్పీకర్.. మంత్రులకు మాట్లాడేందుకు అవకాశం కల్పించారు. దీంతో మళ్లీ అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు లేచి కేకలేశారు. స్పీకర్ వారిని కూర్చోమని పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదు. సభా కార్యక్రమాలు జరుగకుండా పోడియం వద్దకు వచ్చి నినాదాలు చేశారు. దీంతో ఆ అన్నాడీఎంకే ఎమ్మెల్యేలందరినీ సభనుండి గెంటివేయాలని స్పీకర్ మార్షల్స్‌ని ఆదేశించారు. ఆ తర్వాత సభా ఉల్లంఘన హక్కుల చట్టం కింద అన్నాడీఎంకే ఎమ్మెల్యేలందరినీ ఒకరోజంతా (శుక్రవారం) సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు.


అసెంబ్లీ వెలుపల ధర్నా చేస్తున్న అన్నాడీఎంకే సభ్యులు

ఉద్దేశపూర్వకంగానే గెంటేశారు : ఈపీఎస్

రాష్ట్రంలో టీవీ సీరియల్‌లా కొనసాగుతున్న అరాచకాల గురించి ప్రస్తావించకుండా అసెంబ్లీ నుంచి ఉద్దేశపూర్వకంగానే తమను బయటికి గెంటేశారని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిస్వామి ఆరోపించారు. శుక్రవారం అసెంబ్లీ నుండి గెంటివేతకు గురైన అనంతరం సచివాలయ ప్రాంగణంలో ఈపీఎస్ మీడియాతో మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం చట్టసభల్లో ప్రజాసమస్యలపై మాట్లాడే అధికారం ప్రధాన ప్రతిపక్షాలకుందన్నారు. అయితే ప్రధాన సమస్యల గురించి మాట్లాడేందుకు తమకు అవకాశం కల్పించకుండా పథకం ప్రకారమే మైక్ కూడా కట్‌చేస్తున్నారని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం అధికారంలో ఉంటూ ప్రధాన సమస్యల గురించి అసెంబ్లీలో ప్రస్తావించేందుకు అనుమతించకపోవడం ఖండించదగ్గదని ఈపీఎస్ పేర్కొన్నారు.

శాంతిభద్రతలపై దుష్ప్రచారం చేయొద్దు

- అసెంబ్లీలో అన్నాడీఎంకేకి స్టాలిన్ హితవు

చెన్నై, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): డీఎంకే పాలనకు మచ్చ తెచ్చిపెట్టేందుకే ప్రత్యర్థులు ప్రయత్నిస్తున్నారని, ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే శాంతిభద్రతలపై దుష్ప్రచారం చేయడం గర్హనీయమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. శాసనసభలో శుక్రవారం జీరో అవర్‌లో శాంతి భద్రతల సమస్యలపై ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండా ప్రశ్నించేందుకు ప్రయత్నిస్తూ గలాభాకు పాల్పడిన అన్నాడీఎంకే సభ్యులు గెంటివేత, సస్పెన్షన్‌కు గురైన నేపథ్యంలో స్టాలిన్ మాట్లాడుతూ శాసన సభ కీర్తి ప్రతిష్టతలను దిగజార్చేలా అన్నాడీఎంకే సభ్యులు ప్రవర్తించారని, రాష్ట్రంలో శాంతి భద్రతలు పటిష్టంగానే ఉన్నాయని, ఏదో ఒక ప్రాంతంలో జరిగే ఒకటి రెండు హత్యలను ప్రస్తావిస్తూ ప్రజలకు భద్రత కొరవడిందంటూ ఆరోపణలు చేయడం భావ్యమేనా అని ప్రశ్నించారు. శాంతి భద్రతలు పటిష్టంగా ఉండటం వల్లే విదేశీ సంస్థలు రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించేందుకు ఆసక్తికనబరుస్తున్నారని చెప్పారు. రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుండటాన్ని చూసి ఓర్వలేకే పనిగట్టుకుని శాంతి భద్రతలు లేవంటూ సభలో దుమ్మెత్తి పోయడానికి అన్నాడీఎంకే సభ్యులు ప్రయత్నించారని ఆరోపించారు. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి కుల, మతఘర్షణలు జరగలేదని, గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో తుపాకీ కాల్పులదాకా జరిగి ఘర్షణల వివరాలను ప్రస్తావించి సభ సమయాన్ని వృథాచేయదలచుకోలేదన్నారు. రాష్ట్రంలో ఎక్కడ హత్య జరిగినా వెంటనే పోలీసులు తక్షణ చర్యలు చేపట్టి నిందితులను అరెస్టు చేస్తున్నారని ఆయన చెప్పారు. పోలీసులు శాఖ నిర్వీర్యమైపోయిందంటూ అన్నాడీఎంకే సభాపక్షనాయకుడు ఈపీఎస్ చేస్తున్న ఆరోపణలు నిజం కావన్నారు. పోలీసు శాఖ స్వేచ్ఛగా పనిచేస్తుండటం వల్లే ఉన్నతాధికారుల ఆదేశాల కోసం వేచి ఉండక నేరస్థులను సకాలంలో అరెస్టు చేస్తున్నారని స్టాలిన్ వివరించారు.



రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:27 (శనివారం సాయంత్రం)
సహర్: 4:26 (ఆదివారం ఉదయం)

డీఎంకేతోనే ప్రధాన పోటీ

- టీవీకే నేత విజయ్
- పేరులో వీరత్వం ఉంటే చాలా?.. స్టాలిన్‌పై విసుర్లు
- అట్టహాసంగా సర్వసభ్యమండలి

చెన్నై, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో డీఎంకే, టీవీకే పార్టీల మధ్య ప్రధాన పోటీ వుంటుందని, రాజకీయపరంగా డీఎంకే మాత్రమే తమకు బద్ధశత్రువు అని టీవీకే అధినేత విజయ్ మరోమారు పునరుద్ఘాటించారు. తిరువాన్మియూరులోని రామచంద్రా కన్వెన్షన్‌హాలులో జరిగిన టీవీకే సర్వసభ్యమండలి సమావేశంలో విజయ్ మాట్లాడుతూ.. పార్టీలో ద్రావిడం, పాలనలో ద్రావిడ తరహా అంటూ కల్లబొల్లి కబుర్లు చెబుతూ రోజూ జనాన్ని మోసుపుచ్చటమే డీఎంకే పాలకులు పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. పార్టీని ప్రారంభించినప్పటి నుండి సర్వసభ్యమండలి సమావేశం వరకు పాలకులు ఎన్నో అడ్డంకులు కలిగించారని ధ్వజమెత్తారు. పార్టీ ప్రముఖులు ఆదవ్‌అర్జునా, నిర్మల్‌కుమార్, రమేష్ వీరంతా డీఎంకే పాలనను విమర్శిస్తున్నారని, వారిలాగే తాను కూడా విమర్శలు చేయాలా అని కాస్త తటపటాయించానని, ప్రస్తుతం డీఎంకే పాలకులు అదే పనిగా అడ్డంకులు సృష్టిస్తుంటే ఇక ఊరుకోలేనన్నారు.

ఫాసిస్టు పాలన...

'ముత్తువేల్ కరుణానిధి స్టాలిన్ గారూ పేరులో వీరత్వం ఉంటే చాలదు, కార్యాచరణలో, పరిపాలనలో మీ సత్తా ఏమిటో చూపాలి. కేంద్రంలోని బీజేపీది ఫాసిస్టు పాలన అంటూ పదేపదే చెబుతున్న మీరు చేస్తున్నదేమిటో ఒకసారి ప్రశ్నించుకోండి. టీవీకే పార్టీ శ్రేణులు ప్రజలను కలుసుకోనివ్వకుండా అడ్డంకులు కలిగించే అధికారం మీకెవరిచ్చారు? మీ ఆంక్షలను ఉల్లఘించి ప్రజలను కలుసుకోవడానికి నేను సిద్ధంగానే ఉన్నాను. అయితే చట్టాన్ని గౌరవించాలన్న భావంతోనే సహనం పాటిస్తున్నాను అంటూ విజయ్ ధ్వజమెత్తారు. ఆనకట్టలతో వాగును అడ్డుకోగలరు, అదే పెను గాలిని అడ్డుకోలేరు. అడ్డుకుంటే గాలిలో కొట్టుకుపోతారని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు మచ్చుకైనా లేవు, అంతా కరెప్షన్, కపటదారుల ప్రభుత్వమే కారణంగా, ఈ దుస్థితి మారాలని అన్నారు. పార్టీ శ్రేణులు ప్రతి ఇంటికీ వెళ్ళి ఆ ఇంటిలోని వారి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించేందుకు పాటుపడండి అంటూ పిలుపునిచ్చారు. నాలుగేళ్లుగా కష్టాలను అనుభవిస్తున్న మహిళలే వచ్చే యేడాదిజరిగే అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేని చిత్తుగా ఓడించనున్నారని విజయ్ అన్నారు.



విజయ్‌కి జ్ఞాపిక బహూకరిస్తున్న అర్జునన్ తదితరులు - కార్యకర్తలతో కలిసి భోంచేస్తున్న విజయ్

ఎన్నికల పొత్తులపై విజయ్‌కే నిర్ణయాధికారం!

వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఏయే పార్టీలతో పొత్తులు కుదుర్చుకోవాలనే విషయాలపై నిర్ణయాధికారాన్ని పార్టీ అధ్యక్షుడు విజయ్‌కి అప్పగిస్తూ శుక్రవారం జరిగిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) సర్వసభ్య మండలి సమావేశం ఓ తీర్మానం చేసింది. పరందూరులో విమానాశ్రయం ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని రద్దు చేసుకుని మరోచోట ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ, రాష్ట్రంలో ద్విభాషా విద్యా విధానాన్ని కొనసాగించాలని, తమిళ జాలర్ల సమస్యలకు శాశ్వత పరిష్కార దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని, వక్ఫ్ బోర్డు ముసాయిదా సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, లైంగిక వేధింపులను విచారణ జరిపేందుకు స్పెషల్ ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి 90 రోజుల్లో తీర్పులు వెలువరించి దోషులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ ఈ సర్వసభ్యమండలి మొత్తం 17 తీర్మానాలను ప్రవేశపెట్టింది. సర్వసభ్యమండలి సమావేశానికి రాష్ట్రం నలమూలలుల నుండి జిల్లా కార్యదర్శులు, సర్వసభ్యమండలి సభ్యులు ఉదయం ఏడుగంటలకే హాజరయ్యారు. సభ్యులను గుర్తింపు కార్డులో క్యూఆర్‌కోడ్ పరిశీలించిన మీదటే లోపలకు అనుమతించారు. ఉదయం 7.30 గంటలకే పార్టీ అధ్యక్షుడు విజయ్ పనయూరులోని తన నివాసం నుండి బయలుదేరి వేదికకు చేరుకున్నారు. ఉదయం 10 గంటలకు విజయ్ అధ్యక్షత సమావేశం ప్రారంభమైంది. ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్, ఎన్నికల విభాగం నాయకుడు ఆదవ్ అర్జునా, కోశాధికారి వెంకట్రామన్ డిప్యూటీ కార్యదర్శి సీటీ నిర్మల్‌కుమార్ తదితరులు వేదికపై ఆశీనులయ్యారు.

సర్వసభ్యమండలి విశేషాలు..

- విజయ్ తల్లిదండ్రులు ఎస్ఏ చంద్రశేఖర్, శోభ వేదిక ముందు వరుసలో ఆశీనులయ్యారు.
- సర్వసభ్యమండలి సమావేశానికి ఉదయం ఏడు గంటలకే పార్టీ శ్రేణులు తరలిరావటంతో ట్రాఫిక్ సమస్యను పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీఆనంద్ దగ్గరుండి క్రమబద్ధీకరించారు.
- సమావేశానికి వచ్చినవారికి ఉదయం పొంగల్, వడ, టీ పంపిణీ చేశారు. మధ్యాహ్నం 22 రకాల పదార్థాలతో శాఖాహార భోజనాన్ని వడ్డించారు.
- సర్వసభ్యమండలి సమావేశంలోనికి సెల్‌ఫోన్లను అనుమతించలేదు.

సమాచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా ఎన్నూర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

కత్తివాక్కం, ఎన్నూర్‌బజార్, కాట్టుకుప్పం, నెహ్రూ నగర్, శాస్త్రి నగర్, అన్నానగర్, శివన్‌పడై వీధి, వళ్లువర్ నగర్, కామరాజర్ నగర్, ఎస్వీఎం నగర్, వీఓసీ నగర్, ఉగలనాథపురం, ముగత్తువార్‌కుప్పం, ఎన్నూర్ కుప్పం, తాళంకుప్పం, నెడుకుప్పం, చిన్నకుప్పం, పెరియకుప్పం, ఎర్నావూర్ కుప్పం, ఈడీపీఎల్ బోర్డు క్వార్టర్స్ ఎర్నావూర్, జ్యోతి నగర్, రామనాథపురం, శక్తిగణపతి నగర్, షణ్ముగపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది.

సోమవారం తక్కువ సంఖ్యలో సబర్బన్ రైళ్లు

పెరంబూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వచ్చే సోమవారం రంజాన్ పండుగ సందర్భంగా సెలవు రోజు కావడంతో ఆదివారం టైం టేబుల్ ప్రకారం సబర్బన్ రైళ్లు నడువనున్నాయి. ఆ ప్రకారం, చెన్నై సెంట్రల్-అరక్కోణం, చెన్నై సెంట్రల్-గుమ్మిడిపూండి-సూళ్లూరుపేట, చెన్నై బీచ్-చెంగల్పట్టు మార్గాల్లో తక్కువ సంఖ్యలో సబర్బన్ రైళ్లు నడుస్తాయని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

1 నుంచి స్విమ్మింగ్ శిక్షణ

పెరంబూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా క్రీడా ప్రాంగణంలో ఏప్రిల్ 1వ తేది నుంచి స్విమ్మింగ్ శిక్షణ ప్రారంభం కానుంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ప్రతాప్ విడుదల చేసిన ప్రకటనలో.. రాష్ట్ర క్రీడాభివృద్ధి కమిషన్ ఆధ్వర్యంలో వేసవిలో స్విమ్మింగ్‌పై శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఒక్కో శిబిరం 12 రోజులు నిర్వహిస్తున్నట్లు, శిక్షణా కాలంలో రూ.1,770 ఫీజు చెల్లించాలని తెలిపారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేయనున్నామన్నారు. ఆసక్తి కలిగిన వారు జిల్లా క్రీడా శాఖాధికారి 7401703482, స్విమ్మింగ్ ట్రైనర్ 9629795782, 7904488923 అనే నెంబర్లు సంప్రదించాలని కలెక్టర్ విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులకు లలితకళలపై శిక్షణ

పెరంబూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక కన్నగి నగర్‌లోని ఫస్ట్ జనరేషన్ లెర్నింగ్ సెంటర్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు లలితకళలపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. తోలుబొమ్మలాట, గిటార్, కీ-బోర్డు, డ్రమ్స్, నెమలి ఆట్టం, కరగం, నృత్యం సహా పలు కళలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు 044-24581021 అనే నెంబరు సంప్రదించాలని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

శిలాశాసనాల సర్టిఫికెట్ కోర్సు పరిచయం

పెరంబూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నెల్లై మనోన్మణియం సుందరనార్ విశ్వవిద్యాలయంలో, పురావస్తు శాఖ ఆధ్వర్యంలో శిలాశాసనాలు, పురావస్తు శాస్త్రం సర్టిఫికెట్ కోర్సు పరిచయం చేశారు. ఈ కోర్సుకు సంబంధించిన తరగతులు శని, ఆదివారాలు మాత్రమే జరగనున్నాయి.. శిలాశాసనాలు, చదవడం, పర్యవేక్షణ, శిలాశాసనాల్లోని ప్రాచీన తమిళ శాసనాల పరిజ్ఞానం, ప్రాముఖ్యత, ప్రాచీన తమిళుల కళలు, సంస్కృతి తదితర పాఠ్యాంశాలున్నాయి. ఈ కోర్సులో చేరేందుకు ఆసక్తి ఉన్న ప్లస్ టూ ఉత్తీర్ణులైన వారు ఏప్రిల్ 28వ తేదిలోపు https://www.msuniv.ac.in/ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు పంపించాలని వర్సిటీ ఒక ప్రకటనలో తెలిపింది.

ఊటీ కొండ రైలు ప్రత్యేక సేవలు ప్రారంభం

పెరంబూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వేసవి సీజన్ ప్రారంభం కావడంతో పర్యాటకుల సౌకర్యార్థం ఊటీ ప్రత్యేక కొండ రైలు సేవలు శుక్రవారం నుంచి జూలై 6వ తేది వరకు కొనసాగనున్నాయి. ఆ ప్రకారం, మేట్టుపాళయం నుంచి ఊటీకి శుక్ర, ఆదివారాల్లో ఉదయం 9.10 గంటలకు, ఊటీ నుంచి మేట్టుపాళయానికి శని, సోమవారాల్లో ఉదయం 11.35 గంటలకు ఈ ప్రత్యేక రైలు సేవలు అందుబాటులో ఉన్నాయి. తొలిరోజు కోవైకి చెందిన ఓ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 180 మంది ప్రత్యేక రైలులో ఉత్సాహంగా ప్రయాణించారు.

అన్ని బస్సులకు 'ఆటోమేటిక్ డోర్లు'

పెరంబూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బస్సులన్నింటికీ ఆటోమేటిక్ డోర్లు ఏర్పాటుచేయనున్నట్లు రవాణా శాఖ మంత్రి శివశంకర్ తెలిపారు. శాసనసభ సమావేశాల్లో అన్నాడీఎంకే సభ్యుడు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ... ప్రజలు సురక్షితంగా ప్రయాణించేలా అన్ని చర్యలు చేపట్టామన్నారు. అందులో భాగంగా రాజధాని నగరంలో నడుపుతున్న ఎంటీసీ బస్సులకు ఆటోమేటిక్ డోర్లు ఏర్పాటుచేయడం పూర్తయిందని, ఆ తరువాత మిగిలిన ప్రాంతాల్లో విడతల వారీగా అన్ని బస్సులకు ఆటోమేటిక్ డోర్లు ఏర్పాటుచేయనున్నట్లు మంత్రి తెలిపారు.

వీరాణం చెరువులో పడవ సవారీ

పెరంబూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వీరాణం చెరువులో పడవ సవారీ పై చర్యలు చేపడతామని మంత్రి రాజేంద్రన్ తెలిపారు. శాసనసభ సమావేశాల్లో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే చింతనై సెల్వం అడిగిన ప్రశ్నకు మంత్రి రాజేంద్రన్ సమాధానమిస్తూ... రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేలా చర్యలు చేపట్టామన్నారు.అందులోభాగంగా జలాశయాల్లో పడవ సవారీ, పక్కనే అమ్యూజ్‌మెంట్ పార్క్‌లు ఏర్పాటుచేస్తున్నామన్నారు. కడలూరు జిల్లా కాట్టుమన్నార్‌కోయిల్ సమీపంలో ఉన్న వీరాణం చెరువులో పడవ సవారీ ఏర్పాటు విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతామని మంత్రి తెలిపారు.

అమరజీవి స్మారక భవనంలో నేడు ఉగాది వేడుకలు

చెన్నై, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూర్ లజ్‌లో వున్న అమరజీవి పొట్టి పొట్టి శ్రీరాములు స్మారక భవనంలో శనివారం విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు జరుగనున్నాయి. ఇందులో భాగంగా తెలుగు కవులకు సత్కారం జరునుగంది. సాయంత్రం 5 గంటలకు స్మారక భవన నిర్వాహక కమిటీ అధ్యక్షులు కె.అనిల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరుగనున్న ఈ వేడుకలకు సినీ నిర్మాత కాట్రగడ్డ ప్రసాద్ ముఖ్య అతిథిగా, రాష్ట్ర న్యాయశాఖ అదనపు కార్యదర్శి గుర్రం చినగాగూర్ విశిష్ట అతిథిగా హాజరుకానున్నారు. కమిటీ కార్యదర్శి వి.కృష్ణారావు , కవి, రచయిత డాక్టర్ కాసల నాగభూషణం, కమిటీ సభ్యులు ఆచార్య విస్తాలి శంకరరావు, అరుణ శ్రీనాథ్, డాక్టర్ ఏవీ శివకుమారి తదితరుల పర్యవేక్షణలో జరిగే ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

కోవైలో మాదకద్రవ్యాలు, విదేశీ మద్యం స్వాధీనం

● ఎస్‌ఐ కుమారుడి సహా ఏడుగురి అరెస్ట్



పట్టుబడిన నిందితులు

పెరంబూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్‌లో ఖరీదైన మాదకద్రవ్యాలు, విదేశీ మద్యం విక్రయిస్తున్న మహిళా ఎస్‌ఐ కుమారుడు సహా ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. కోవైలోని పలు ప్రాంతాల్లో ఉన్నత రకం మాదకద్రవ్యం, విదేశీ మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ వ్యవహారంపై కోవై పోలీస్ కమిషనర్ శరవణసుందర్ ఆదేశాల మేరకు ప్రత్యేక విభాగం ఇన్‌స్పెక్టర్ వివేక్, ధనపాల్ నేతృత్వంలో పోలీసులు ఆర్‌ఎస్ పురం ప్రాంతంలో గస్తీ చేపట్టారు. ఆ సమయంలో మేట్టుపాళయం రోడ్డు పూల మార్కెట్ అమ్మ క్యాంటీన్ గేటు సమీపంలో ఏడుగురు నిలబడి ఉండగా, వారిపై అనుమానంతో పోలీసులు వెళ్లగా, వారు పరారయ్యేందుకు యత్నించగా, పోలీసులు వారిని చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఎమ్డీఎంఏ పౌడర్, కొకైన్, గంజాయి సహా ఉన్నతరకం మాదకద్రవ్యాలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. విచారణలో వారు, నీలగిరి జిల్లా ఊటీ ఇత్తలార్‌పోత్తియాడ ప్రాంతానికి చెందిన మణికంఠన్ (39), కృష్ణగిరి జిల్లా ఊత్తంగరై ఆనందూర్‌కు చెందిన వినాయగం (34), కోవై పీఎన్ పాళయానికి చెందిన కృష్ణన్‌కాంత్ (35), వడవల్లి మహావిష్ణు (28), ఆదర్శ్ (34), నితేష్‌లంబ (41), రోహన్‌చెట్టి (30) అని గుర్తించారు. వారిలో మహావిష్ణు కోవై జిల్లా ఆర్థికనేర విభాగం ప్రత్యేక ఎస్‌ఐ విజయలక్ష్మి కుమారుడు అని తెలిసింది. వారు మహారాష్ట్ర, హిమాచల్‌ప్రదేశ్ సహా పలు రాష్ట్రాల ఉంచి మాదకద్రవ్యాలు తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. వారి నుంచి 245.40 గ్రాముల ఎమ్డీఎంఏ ఉన్నతరకం మాదకద్రవ్యం పౌడర్, 12.47 గ్రాముల ఎమ్డీఎంఏ పౌడర్, 92.43 గ్రాముల కొకైన్, 1.620 కిలోల గ్రీన్ గంజాయి, 1.16 కిలోల ఎండు గంజాయి, రూ.25 లక్షల నగదు, నగదు లెక్కించే యంత్రం, మాదకద్రవ్యాలు తూకం వేసే యంత్రం, విదేశీ మద్యం, మూడు కార్లు, 12 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఎస్వీటీ మాధ్యమిక పాఠశాలలో ఉగాది సంబరాలు



బహుమతులందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

ప్యారీస్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆవడి కామరాజర్‌నగర్‌లోని ఎస్వీటీ మాధ్యమిక పాఠశాలలో విశ్వావసు నామ ఉగాది వేడుకలు శుక్రవారం జరిగాయి. ప్రార్థనా గీతంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జి.అనిత స్వాగతం పలుకగా, ముఖ్యఅతిథిగా సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ స్వర్ణా శ్రీకాంత్ హాజరై వివిధ పోటీల్లో గెలిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఉగాదిని పురస్కరించుకుని వివిధ వేషధారణలతో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. పాఠశాల కరస్పాండెంట్ జీఎస్ జ్యోతి కృష్ణన్, అధ్యక్షులు ఎం.వెంకటరమణ, ఉపాధ్యక్షులు జి.నరసింహులనాయుడు, ట్రెజరర్ పి.భాస్కరన్, కమిటీ సభ్యులు ఆర్.పద్మనాభన్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లపట్టాలపై కలెక్టర్ సర్వే



ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నగర ప్రాంతంలోని పేదప్రజలు తాము నివసిస్తున్న ఇంటికి పట్టాలివ్వాలని కోరుతూ కలెక్టర్‌కు గత సోమవారం వినతిపత్రాలు అందించారు. నేపథ్యంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి వెళ్లి ఫీల్డ్ సర్వే చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుబ్బులక్ష్మితో పాటు రెవెన్యూ శాఖ అధికారులు సెంథిల్‌కుమార్, ఎమ్మార్వో జగదీశ్వరన్ తదితరులు పాల్గొన్నారు.

● మంత్రి సుబ్రమణ్యంకు చుక్కెదురు...

స్థల ఆక్రమణ కేసు రద్దుకు హైకోర్టు నిరాకరణ

పెరంబూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మంత్రి సుబ్రమణ్యంపై నమోదైన స్థల ఆక్రమణ కేసు రద్దు చేసేందుకు మద్రాసు హైకోర్టు నిరాకరించింది. గిండి సిట్కో ప్రాంతంలో ఎస్కే కన్నన్‌కు రెసిడెన్షియల్ ప్లాట్ కేటాయించారు.అప్పట్లో చెన్నై మేయర్‌గా, ప్రస్తుతం మంత్రిగా ఉన్న ఎం.సుబ్రమణ్యం నకిలీ పత్రాలతో ఆ ప్లాట్‌ను తన భార్య కాంచన పేరిట బదిలీ చేశారనే ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంపై సైదాపేటకు చెందిన పార్తీపన్ ఇచ్చిన ఫిర్యాదుతో గత అన్నాడీఎంకే ప్రభుత్వం సుబ్రమణ్యంపై భూకబ్జా కేసు నమోదుచేసింది. ఈ కేసు నగరంలోని ఎంపీ, ఎమ్మెల్యేలపై కేసులు విచారిస్తున్న ప్రత్యేక కోర్టులో విచారణలో ఉంది. ఈ కేసు రద్దు చేయాలని కోరుతూ మంత్రి తరఫున హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ కేసు విచారణ సమయంలో మంత్రి సుబ్రమణ్యం తరఫున.. 1998లో ఆ ప్లాట్ కొనుగోలు చేసిన నేపథ్యంలో, 20 ఏళ్ల అనంతరం రాజకీయ కక్షల కారణంగా తనపై కేసు నమోదుచేశారని తెలిపారు. ఆకాలంలో తాను కార్పొరేటర్‌గా ఉన్నానని, ప్లాట్ కొనుగోలుతో ప్రభుత్వం, సిట్కోకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. అలాగే, పోలీసుల తరఫున.. ఈ కేసులో అభియోగాలపై ట్రయల్‌కోర్టు మాత్రమే నిర్ణయం తీసుకోగలదని తెలిపారు. పిటిషనర్ తరఫున... మంత్రి సుబ్రమణ్యం కేసు రద్దచేయరాదని వాదించారు. అందరి వాదనల అనంతరం న్యాయమూర్తి తీర్పు వాయిదావేశారు.ఈనేపథ్యంలో ఈ కేసులో శుక్రవారం తీర్పు వెలువరించిన న్యాయమూర్తి వేల్‌మురుగన్,తనపైఉన్న భూకబ్జా కేసును రద్దు చేయాలని మంత్రి సుబ్రమణ్యం దాఖలుచేసిన పిటిషన్ తోసిపుచ్చారు. అభియోగాలు నమోదుచేసి దర్యాప్తు కొనసాగించాలని ప్రత్యేక కోర్టుకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది.

అన్నాడీఎంకే-డీఎంకే మధ్యే పోటీ

● విజయ్ వ్యాఖ్యలపై జయకుమార్ స్పందన

పెరంబూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాబోయే 2026 ఎన్నికల్లో అన్నాడీఎంకే-డీఎంకే మధ్య పోటీ ఉంటుందని మాజీ మంత్రి జయకుమార్ స్పష్టం చేశారు. స్థానిక తిరువాన్మియూర్‌లో సోమవారం జరిగిన టీవీకే సర్వసభ్య మండలి సమావేశంలో ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్, అధికార డీఎంకేను తీవ్రంగా విమర్శించారు. అలాగే, ముఖ్యమంత్రి స్టాలిన్, ప్రధాని మోదీ పేర్లను ఉచ్చరిస్తూ ప్రసంగించారు. 2026లో జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో టీవీకే-డీఎంకే అనే రెండింటి మధ్యనే పోటీ ఉంటుందని, అందుకు కార్యకర్తలు ఆత్మవిశ్వాసంతో సిద్ధం కావాలన్నారు. ఈ నేపథ్యంలో, విజయ్ వ్యాఖ్యలపై మాజీ మంత్రి జయకుమార్ మాట్లాడుతూ... అసలు పోరు డీఎంకే-అన్నాడీఎంకే మధ్య ఉంటుందని, కార్యకర్తలను ఉత్సాహపరిచేలా ఆయన (విజయ్) అలా మాట్లాడారని జయకుమార్ పేర్కొన్నారు.

'కాబోయే సీఎం బుస్సీ ఆనంద్'

● టీవీకే పోస్టర్ కలకలం

ప్యారీస్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రధాన కార్యదర్శి 'బుస్సీ ఆనంద్ కాబోయే ముఖ్యమంత్రి' అంటూ ఓ కార్యకర్త నగరంలో అంటించిన పోస్టర్ పార్టీశ్రేణులను కలవరపరిచింది. ప్రముఖ సినీనటుడు విజయ్ స్థాపించిన టీవీకే తొలి సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొనే ఆ పార్టీ నేతలను ఆహ్వానిస్తూ శరవణన్ అనే చెన్నై శివారు జిల్లా కార్యదర్శి శరవణన్ నగరంలో అంటించిన పోస్టరులో బుస్సీ ఆనంద్ కాబోయే ముఖ్యమంత్రి అంటూ వేయడం పార్టీ కార్యకర్తలను అయోమయానికి గురిచేసింది. వివాదాస్పదమైన ఈ పోస్టర్ గురించి బుస్సీ ఆనంద్ మీడియాతో మాట్లాడుతూ, టీవీకే అధ్యక్షుడు విజయ్ అని, ఆయనే 2026లో ముఖ్యమంత్రి పీఠం ఎక్కుతారని, ఇందులో ఎటువంటి మార్పుటు ఉండబోవన్నారు.

● రంజాన్ ఎఫెక్ట్

రూ.కోట్లలో మేకల విక్రయాలు



చెన్నై, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా రూ.12 కోట్ల మేర మేకల విక్రయాలు జరిగినట్లు మదురై సమీపం తిరుమంగళం సంత నిర్వాహకులు తెలిపారు. విల్లుపురంలో జిల్లా సెంజి సంతలోనూ, పొల్లాచ్చి సంతలోనూ గతంలో లేని విధంగా మేకల అమ్మకాలు బాగా పుంజుకున్నాయని తెలిపారు. మేక సైజులను బట్టి రూ.5వేల నుండి రూ.25 వేల రూపాయలకు అమ్ముడైనట్లు తెలిపారు. సెంజి సంతలో శుక్రవారం ఉదయం 15 కేజీల మేక రూ.9వేల నుండి రూ.11 వేల ధరలకు విక్రయించారు. పొల్లాచ్చి సంతలో శుక్రవారం ఉదయం 7 నుండి 8 గంటలలోపే 600 మేకలు అమ్ముడయ్యాయి. పొల్లాచ్చి సంతలో గురువారం సాయంతం వరకూ రూ.80లక్షల వరకు మేకలు విక్రయాలు జరిగాయని సంత నిర్వాహకులు తెలిపారు. ఇక శుక్రవారం ఉదయం ఈ మూడు సంతల్లో ఒకే రోజు రూ.12 కోట్ల వరకూ మేకలు అమ్ముడైనట్లు తిరుమంగళం సంత నిర్వాహకులు ప్రకటించారు. శని, ఆదివారాల్లోనూ మేకల అమ్మకాలు మరింత ఊపందుకుంటాయని చెప్పారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

పెరంబూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాంబరం సమీపంలో విద్యుదాఘాతంతో విద్యార్థి మృతిచెందాడు. ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న తమిళరసు (12) శుక్రవారం ఉదయం ఇంట్లో వాటర్ హీటర్ ద్వారా నీరు వేడిచేసుకుంటున్నాడు. నీరు వేడెక్కాయా? లేదా? అని చూసేందుకు వాటర్ హీటర్ తీయకుండా బక్కెట్లో నీటిలో చేయి పెట్టడంతో విద్యుతాఘాతానికి గురై ఘటనా స్థలంలోనే మృతిచెందాడు.

గిండి ఆస్పత్రిలో పోలీస్ అవుట్ పోస్ట్

పెరంబూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రాంగణంలో పోలీసు అవుట్ పోస్ట్ ఏర్పాటుచేశారు. ఈ ఆస్పత్రికి ప్రతిరోజు వేలాది మంది చికిత్స కోసం వస్తుంటారు. కొద్ది రోజుల క్రితం ఈ ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యుడిపై ఓ రోగి బంధువు కత్తితో దాడిచేసిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనతో పోలీసు అవుట్ పోస్ట్ ఏర్పాటుచేయాలని వైద్యులు ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో, రోటరీ సంఘం సహకారంతో ఏర్పాటుచేసిన తాత్కాలిక పోలీసు అవుట్ పోస్ట్‌ను గురువారం మంత్రి సుబ్రమణ్యం ప్రారంభించారు. త్వరలో శాశ్వత భవనం నిర్మించి, పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు చేపడతామని మంత్రి సుబ్రమణ్యం తెలిపారు.

రేపు ఆస్కాలో ఉగాది వేడుకలు

చెన్నై, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్ విజయరాఘవరోడ్డులో వున్న ఆంధ్రా సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ (ఆస్కా) ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది వేడుకలు జరుగనున్నాయి. ఆస్కా గోదావరి హాలులో పూజ, పంచాంగ శ్రవణం, వేదాశీర్వచనం, ఉగాది పచ్చడి ప్రసాద పంపిణీ అనంతరం 5.45 గంటలకు మధుర కళానికేతన్ బృందం డాక్టర్ మాదవి మల్లంపల్లి వారిచే కిన్నెరసాని కూచిపూడి నృత్య నాటిక జరుగనుంది. సాయంత్రం 6.45 గంటలకు డాక్టర్ నరాల రామరెడ్డిచే 'అవధాన సాహిత్యంలో సొగసులు' ఉపన్యాస కార్యక్రమం జరుగనుంది. చెన్నై ఇన్‌కంట్యాక్స్ చీఫ్ కమిషనర్ డాక్టర్ డి.సుధాకరరావు, చెన్నై కస్టమ్స్ జీఎస్టీ-నార్కొటిక్ డిప్యూటీ కమిషనర్ మధులత ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. 8 గంటలకు ఆంధ్ర రుచులతో విందు వుంటుంది. గోదావరి హాలులో జరుగనున్న ఈ వేడుకకు అందరూ ఆహ్వానితులేనని ఆస్కా ట్రస్టు చైర్మన్ డాక్టర్ కె.సుబ్బారెడ్డి, మేనేజింగ్ ట్రస్టీ పి.శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి ఎ.ఆదినారాయణరెడ్డి సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

వేలూరులో ప్రారంభమైన టెన్త్ పరీక్షలు



వేలూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా గుడియత్తం, కాట్పాడి, వళ్ళిమలై, పొన్నై తదితర ప్రాంతాల్లో ఈ శుక్రవారం నుండి ప్రారంభమైన టెన్త్ పబ్లిక్ పరీక్షలకు అధికారులు గురువారం నుండే ఏర్పాట్లు సిద్ధంచేశారు. వేలూరు పరిసర ప్రాంతాల్లో 103 పరీక్షా కేంద్రాలు వుండగా, అందులో 8,984 మంది విద్యార్థులు, 9,105 మంది విద్యార్థినిలు ఈ పరీక్ష రాశారు. విద్యార్థుల కోసం పరీక్షా కేంద్రాలకు ప్రత్యేక బస్సులు నడిపారు.

నేడు పూండికి కృష్ణా జలాలు

పెరంబూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్రం కండలేరు డ్యాం నుంచి విడుదల చేసిన కృష్ణా జలాలు శనివారం పూండి జలాశయానికి చేరుకుంటాయని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు. రాజధాని నగర ప్రజల దాహార్తి తీర్చేలా, ఆంధ్ర-తమిళనాడు మధ్య జరిగిన నదీజలాల ఒప్పందం ప్రకారం, ఆంధ్ర ప్రభుత్వం రాష్ట్రానికి జూలై నుంచి అక్టోబరు వరకు 8 టీఎంసీలు, జనవరి నుంచి ఏప్రిల్ వరకు 4 టీఎంసీలు, 3 టీఎంసీల నష్టం అని మొత్తం 15 టీఎంసీలు అందించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో, రాష్ట్రానికి నీరు విడుదల చేయాలనే ప్రజాపనుల శాఖ విజ్ఞప్తితో ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం గత సోమవారం ఉదయం కండలేరు డ్యాం నుంచి నీరు విడుదల చేశారు. ఈ జలాలు 155 కి.మీ ప్రయాణించి శుక్రవారం ఉదయం రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన ఊత్తుకోట జీరో పాయింట్‌కు చేరుకున్నాయి. అక్కడి నుంచి 25 కి.మీ ప్రయాణించి శనివారం పూండి జలాశయానికి చేరుకునే అవకాశముంది. కండలేరు నుంచి విడుదల చేస్తున్న నీటిని పెంచే అవకాశముండడంతో, పూండి జలాశయం నుంచి చెంబరంబాక్కం, పుళల్ జలాశయాలకు నీటిని విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

31న మధ్యాహ్నం వరకే రిజర్వేషన్ కేంద్రాలు

పెరంబూర్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ సందర్భంగా సోమవారం రిజర్వేషన్ కేంద్రాలు మధ్యాహ్నం వరకు మాత్రమే పనిచేయనున్నాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ కేంద్రాలు పనిచేస్తాయని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

రాష్ట్రంలో పోలీసులకే రక్షణ లేదు...!

● టీటీవీ దినకరన్

పెరంబూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పోలీసులకే రక్షణ కరువైందని, మరి వారు ప్రజలను ఎలా రక్షిస్తారని అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... మదురై జిల్లా ఉసిలంబట్టిలో ఉన్న టాస్మాక్ దుకాణంలో జరిగిన ఘర్షణలో కానిస్టేబుల్ ముత్తుకుమార్‌పై గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేసి హతమార్చిన ఘటన ఆందోళన కలిగిస్తుందన్నారు. నేరాలు అడ్డుకొనే శాంతి భద్రతలు పర్యవేక్షించాల్సిన పోలీసులకే రక్షణ లేని పరిస్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు.

ప్రభుత్వాస్పత్రికి వాటర్ ఫిల్టర్స్

వేలూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పల్లికొండ ప్రాంతంలోని ప్రభుత్వాస్పత్రికి ఆ ప్రాంత రోటరీ సంఘం తరుపున ఉచిత వాటర్ ఫిల్టర్లను అందజేశారు. వేసవి లో కూలింగ్ వాటర్‌ను ఆస్పత్రి సిబ్బంది, రోగులకు అందించాలనే ఆశయంతో రోటరీ అధ్యక్షుడు విశ్వనాదన్ నేతృత్వంలో ఆస్పత్రి సిబ్బందికి వాటర్ ఫిల్టర్లను అందించారు. సెక్రటరీ వెంకటేశన్, కోశాధికారి సుందరం, సంఘ డైరెక్టర్ గోవింద్‌రామ్, ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

విద్యార్థినులతో వెకిలిగా మాట్లాడిన టీచర్ సస్పెన్షన్

పెరంబూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులతో ద్వంధర్థాలతో మాట్లాడిన టీచర్‌పై సస్పెన్షన్ వేటుపడింది. కళ్లకుర్చిలోని ప్రభుత్వ మహిళా మహోన్నత పాఠశాలలో సోషల్ సైన్స్ టీచర్‌గా పనిచేస్తున్న అన్బళగన్ (59) 9వ తరగతి విద్యార్థినులతో తరచా ద్వంద్వర్థాలతో మాట్లాడుతున్నట్లు సమాచారం. ఈ విషయమై బాధిత విద్యార్థినులు జిల్లా కలెక్టర్, జిల్లా ప్రధాన విద్యాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై ఉపాధ్యాయుడు అన్బగళన్‌పై శాఖాపరమైన విచారణ చేపట్టాలని జిల్లా ప్రధాన విద్యాధికారి కార్తీక ఆదేశించి, ఆయనను సస్పెండ్ చేశారు.

బస్సు నుంచి జారిపడిన విద్యార్థి

డ్రైవర్, కండక్టర్ సస్పెన్షన్

పెరంబూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా బస్సు నడిపిన కారణంగా విద్యార్థిని జారిపడిన ఘటనలో డ్రైవర్, కండక్టర్‌లపై సస్పెన్షన్ వేటు పడింది.. కడలూరు ప్రభుత్వ బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థిని, తాను దిగాల్సిన బస్టాప్ రావడంతో దిగేందుకు యత్నించింది. డ్రైవర్ బస్సును ఆపినట్లు వేగం తగ్గించి, వెంటనే వేగం పెంచడంతో విద్యార్థిని ఫుట్ బోర్డు జారిపడింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన విద్యార్థిని చుట్టుపక్కల వారు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా బస్సు నడిపిన తాత్కాలిక డ్రైవర్ రఘోత్తమన్, కండక్టర్ జయపాల్‌ను సస్పెండ్ చేస్తూ కడలూరు రవాణా సంస్థ ఉత్తర్వులు జారీచేసింది.

విద్యుదాఘాతంతో రైతు మృతి



మునుస్వామి (ఫైల్ ఫొటో)

తిరుత్తణి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెగపడిన విద్యుత్ తీగ తొక్కి షాక్‌కి గురై రైతు మృతిచెందిన ఘటన తిరువళ్లూరు జిల్లా ఆర్కేపేటలోని బండికుప్పంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మునుస్వామి (50) గురువారం రాత్రి తన పొలంలో నీరు పట్టేందుకు వెళ్లగా, దారిలో తెగిపడివున్న విద్యుత్ వైరును తొక్కడంతో విద్యుదాఘాతంతో మృతిచెందాడు. అదే సమయంలో వస్తున్న మరో వ్యక్తి ఇచ్చి సమాచారంతో కుటుంబసభ్యులు వచ్చి మునుస్వామిని ప్రభుత్వాసుత్రికి తరలించగా వైద్యులు ఇంతకుముందే అతను మృతిచెందాడని నిర్ధారించారు. సమాచారమందుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకుని కేసునమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జనావాసాల్లోకి పాము



పామును పట్టుకున్న అగ్నిమాపక శాఖ ఉద్యోగి

వేలూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వేలూరు కార్పొరేషన్ పరిధిలోని తెన్నమరవీధిలో శుక్రవారం ఉదయం హఠాత్తుగా జనసంచారంలోకి పాము రావడంతో అక్కడి స్థానికులు హడలెత్తిపోయారు. సమాచారమందుకున్న అగ్నిమాపక సిబ్బం ది అక్కడికి చేరుకుని పామును పట్టుకోవడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

చెన్నైలో రాత్రి వేళ బైక్ రేస్

● 32 వాహనాల స్వాధీనం

ప్యారీస్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం రాత్రి బైక్ రేస్‌లో పాల్గొన్న 32 ద్విచక్రవాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ అరుణ్ ఉత్తర్వుల మేరకు నగరంలో రాత్రివేళ పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్నారు. ఆ సమయంలో అన్నానగర్‌లోని 2వ మెయిన్ రోడ్డులో కొంతమంది యువకులు బైక్ రేస్ చేయడం చూసిన పోలీసులు వారిని చుట్టుముట్టి 9 బైకులు స్వాధీనం చేసుకుని ట్రాఫిక్ పోలీసులకు అప్పజెప్పారు. అదేవిధంగా కోడంబాక్కంలో బైక్ రేస్‌లో పాల్గొన్న 6 ద్విచక్ర వాహనాలు, అన్నాసాలై బైక్ రేస్‌లో పాల్గొన్న 17 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని సంబంధిత బైక్ రైడర్లపై కేసు నమోదు చేశారు.

హెరాయిన్ విక్రయించిన ముగ్గురి అరెస్ట్

ప్యారీస్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక పుదుపేటలో చట్టవిరుద్ధంగా హెరాయిన్ విక్రయించిన ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. ఎగ్మూర్ మేజిస్ట్రేట్ కోర్టు సమీపంలోని పుదుపేటలో కొంతమంది మాధకద్రవ్యాలు విక్రయిస్తున్నట్లు నగర పోలీసు కార్యాలయంలోని ప్రత్యేక విభాగానికి సమాచారం వచ్చింది. దీంతో గురువారం వేకువజామున పుదుపేట సీపీఎం వీధిలోవున్న ఆవిన్‌బూత్ సమీపంలో పోలీసులు నిఘా వేశారు. ఆ సయయంలో అక్కడ నిలబడివున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా వాళ్ళు పొంతనలేకుండా సమాధానం చెప్పారు. వారు అస్సాం రాష్ట్రానికి చెందిన ఇస్లాం, రెహ్మన్‌ఖాన్ , అస్కర్ అలీ (21)అని తెలిసింది. వారి వద్ద 1.15 కిలోల హాన్స్, 17 గ్రాముల హెరాయిన్, రూ.1950 నగదు, 2 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

ముస్లింలకు అల్పాహారం



ముస్లిం పిల్లలకు అల్పాహారాన్ని పంపిణీ చేస్తున్న దినేష్ తదితరులు

వేలూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రంజాన్ ఉపవాస దీక్షల నేపథ్యంలో వేలూరు కసలపేటలోని మసీదు ప్రాం గణంలోవున్న ముస్లిం పిల్లలకు శుక్రవారం అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేలూరు రంగాపురానికి చెందిన ఐటీ ఉద్యోగి దినేష్ ఆధ్యార్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఎంతో కఠోరమైన ఉపవాస దీక్షలను కొనసాగిస్తున్న ముస్లిం సోదరులకు నావంతు సాయంగా అల్పాహారం పంపిణీ చేశామని తెలిపారు.

వలత్తూర్‌లో మొబైల్ వైద్యశిబిరం



వేలూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వేలూరు గుడియత్తం సమీపంలోని వలత్తూర్‌లో జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి ఆదేశాల మేరకు రాష్ట్ర ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పేదప్రజలకు ఉచిత మొబైల్ వైద్యశిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఇందులో చికిత్సలందుకున్న గ్రామ పారిశుధ్య కార్మికులు, చక్కెర వ్యాధి గ్రస్థులకు, బీపీ, క్షయవ్యాధి గ్రస్థులకు మొబైల్ వైద్యశిబిరంలోని వైద్యులు మందులు అందజేశారు.


ఆడియో రిలీజ్ దృశ్యం


ఆత్మహత్య.. సమస్యలకు పరిష్కారం కాదు

● డైరెక్టర్ విఘ్నేశ్ పాండియన్ ● 'కొంజనాల్ పొరు తలైవా' ఆడియో రిలీజ్

'జీవితంలో ఎదురయ్యే ఏ సమస్యకైనా ఆత్మహత్య పరిష్కారం కాదు' అనే ప్రధాన ఇతివృత్తంతో 'కొంజనాల్ పొరు తలైవా' చిత్రాన్ని రూపొందించినట్టు దర్శకుడు విఘ్నేశ్ పాండియన్ పేర్కొన్నారు. ఆరుద్ర న్ పిక్చర్స్ పతాకంపై ఎస్.మురుగన్ నిర్మాణంలో విఘ్నేష్ పాండియన్ తొలిసారి దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఆడియో, ట్రైలర్ రిలీజ్ గురువారం రాత్రి నగరంలో జరిగింది. ఈ చిత్రం ఆడియో రిలీజ్ వేడుకలో దర్శకుడు మాట్లాడుతూ, 'నాపై నమ్మకం ఉంచి ఈ మూవీకి దర్శకత్వం చేసే అవకాశం కల్పించిన నిర్మాతకు ధన్యవాదాలు. జీవితంలో ఎదురయ్యే ఏ సమస్యకైనా ఆత్మహత్య పరిష్కారం కాదు అనే కథాంశంతో ఈ సినిమా రూపొందించాను. హీరోహీరోయిన్ల లిప్‌లాక్ సీన్లు, రొమాన్స్ ఇలా అన్ని అంశాల మేళవింపుతో ఈ మూవీ రూపొందించాం. నిషాంత్ రూషో, గాయిత్రి షాన్ హీరోహీరోయిన్లుగా నటించారు. ఇందులో విలన్‌గా 'జైలర్' మూవీ ఫేం హర్షద్ నటించారు. సింగంపులి అతిథి పాత్రలో కనిపిస్తారన్నారు. హీరో నిషాంత్ మాట్లాడుతూ, 'ఈ యేడాది నాకు బాగా కలిసివచ్చింది. మూడు సినిమాలు విడుదలయ్యాయి. ఈ మూవీ కూడా చాలాబాగా వచ్చింది. చిత్ర బృందానికి మీడియా మిత్రులు అండగా ఉండాలని కోరుకుంటున్నాను' అని పేర్కొన్నారు. సంగీత దర్శకుడు సమంత్ నాగ్ మాట్లాడుతూ, 'ఈ చిత్ర నిర్మాతను తొలిసారి ఇక్కడే చూస్తున్నాను. దర్శకుడు, నాకు పలుమార్లు గొడవ జరిగింది. తామిద్దరం గొడవపడింది సినిమా కోసమే. పాటల రచయిత అస్విన్‌కు మంచి భవిష్యత్ ఉంది. నాతో కలిసి పనిచేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.

'గజిని-2'పై ఏఆర్ మురుగదాస్ ఏమన్నారు?

గతంలో సూర్య హీరోగా తన దర్శకత్వంలో వచ్చి 'గజిని' చిత్రానికి రెండో భాగం రూపొందించే విషయంపై సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటామని డైరెక్టర్ ఏఆర్.మురుగదాస్ అన్నారు. బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ హీరోగా తాను దర్శకత్వం వహించిన చిత్రం 'సికిందర్' త్వరలోనే విడుదలకానుంది. ఈ మూవీ ప్రచార కార్యక్రమాల్లో భాగంగా 'గజినీ-2' మూవీపై ఎదురైన ప్రశ్నకు ఏఆర్.మురుగదాస్ సమధానమిస్తూ, 'ప్రస్తుతం ప్రతి ఒక్కరూ వారి వారి ప్రాజెక్టులతో బిజీగా ఉన్నాం. ఒక రోజు మేమంతా కూర్చొని సరైన నిర్ణయం తీసుకుంటాం' అని అన్నారు. కాగా, టాలీవుడ్ నిర్మాత అల్లు అరవింద్ 'గజిని-2' ప్రాజెక్టు నిర్మించే పనిలో నిమగ్నమయ్యారు. ఇదే విషయంపై తన మనసులోని మాటను సూర్య, అమీర్ ఖాన్ వద్ద వ్యక్తం చేశారు. పైగా 'గజినీ-2' మూవీని ఏక కాలంలో తమిళం, తెలుగు భాషల్లో తెరకెక్కించాలనే ఆలోచనలో అల్లు అరవింద్, కొందరు తమిళ నిర్మాతలు ఉన్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం.


సూర్య - ఏఆర్ మురుగదాస్

అరుణాచలేశ్వరుడి సేవలో స్నేహ దంపతులు


స్నేహ - ప్రసన్న దంపతులు

● దర్శకుడు విఘ్నేష్ శివన్ కూడా

తమిళ, తెలుగుతో పలు దక్షిణాది భాషా చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి స్నేహ తన భర్త, నటుడు ప్రసన్నతో కలిసి తిరువణ్ణామలై అరుణాచలేశ్వర స్వామి సేవలో పాల్గొన్నారు. అలాగే దర్శకుడు విఘ్నేష్ శివన్ కూడా అరుణచలేశ్వర స్వామి ఆలయంలో జరిగిన గోపూజ లో పాల్గొన్నారు. ఫంగుణి మాస కృష్ణపక్షం ప్రదోషాన్ని పురస్కరించుకుని స్నేహ దంపతులు గురువారం రాత్రి తిరువణ్ణామలై చేరుకుని, శుక్రవారం వేకువజామున 3 గంటల సమయంలో గిరిప్రదక్షిణ చేశారు. ఆ తర్వాత అరుణచలేశ్వర స్వామి దర్శనం చేసుకున్నారు. కాగా, గిరివలం మార్గంలో స్నేహను చూసిన అభిమానులు ఆమెతో సెల్ఫీలు, ఫొటోలు తీసుకునేందుకు పోటీపడ్డారు. అదేవిధంగా, సినీ దర్శకుడు విఘ్నేష్ శివన్ కూడా తిరువణ్ణామలై వచ్చి అరుణచలేశ్వర స్వామి ఆలయంలో జరిగిన గోపూజలో పాల్గొన్నారు. ఆ తర్వాత అన్నామలై, ఉన్నాములై అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి, స్వామివారి దర్శనం చేసుకున్నారు.


గోపూజ చేస్తున్న విఘ్నేష్ శివన్

18న విజయ్ 'సచిన్' రీ రిలీజ్

● నిర్మాత థాను వెల్లడి

తమిళ చిత్రజ్యోతి

విజయ్ హీరోగా నటించిన 'సచిన్' మూవీని వచ్చే నెల 18వ తేదీ రీ రిలీజ్ చేయనున్నట్టు ఆ చిత్ర నిర్మాత కలైపులి ఎస్.థాను వెల్లడించారు. ఇదే విషయంపై నిర్మాత థాను మాట్లాడుతూ, "సచిన్' చిత్రం రీరిలీజ్ చేసేందుకు కలర్ మిక్సింగ్ వంటి సాంకేతిక పనులు జరుగుతున్నాయి. అన్నీ పూర్తి చేసి ఏప్రిల్ 18న అత్యధిక థియేటర్లలో రీ రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం. ఆ తర్వాత విజయ్ నటించిన అనేక చిత్రాలను రీ రిలీజ్ చేయాలన్న సంకల్పంతో ఉన్నాం. ఈ వారం 'భగవతి' విడుదల చేస్తున్నాం' అని పేర్కొన్నారు. కాగా, 'సచిన్' మూవీలో పాటలతో పాటు స్టోరీ, హాస్యం ఇలా ప్రతి ఒక్కటీ ప్రేక్షకులను అలరించిన విషయం తెల్సిందే.



'సచిన్'లో ఓ దృశ్యం

తెలుగువారి ఆది పండుగ ఉగాది

● మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ 'విశ్వావసు' వేడుకల్లో వక్తలు

పెరంబూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలుగువారికి ఆది పండుగ ఉగాది అని పలువురు వక్తలు కొనియాడారు. మెరీనా బీచ్ సమీపంలోని మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆధ్వర్యంలో 'విశ్వావసు ఉగాది వేడుకలు' శుక్రవారం ఆహ్లాదకర వాతావరణంలో జరిగాయి. ప్రారంభ సమావేశానికి తెలుగు శాఖ అతిథి ఉపన్యాసకులు డా.పాండురంగం కాళియప్ప స్వాగతం పలుకగా, నిడమర్తి వసుంధరాదేవి 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ..' ప్రార్థనా గీతంతో కార్యక్రమం ప్రారంభమైంది. సమావేశానికి అధ్యక్షత వహించిన శాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు మాట్లాడుతూ... తెలుగువారి తొలి పండుగ తెలుగు వారి సమక్షంలో తెలుగు శాఖలో జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రారంభ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ సినీ గేయరచయిత భువనచంద్ర మాట్లాడుతూ... తెలుగు వారి పర్వదినం తెలుగుశాఖ ఆధ్వర్యంలో తెలుగువారి మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ప్రత్యేక అతిథి తమ్మినేని బాబు మాట్లాడుతూ.. మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ మొదటిసారిగా ఉగాది కార్యక్రమం నిర్వహించడం, తెలుగువారిగా మద్రాసు వాసులమైన మాకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రారంభ సమావేశంలో డా.కాసల నాగభూషణం... ఉగాది విశిష్టతను కవితా రూపంలో తెలియజేశారు. సమావేశంలో ముందుగా డా.టీఆర్ఎస్ శర్మ పంచాంగ పఠనం చేశారు.


ఉగాది వేడుకల్లో భువనచంద్ర, విస్తాలి శంకరరావు, తమ్మినేని బాబు, టీఆర్ఎస్ శర్మ, ఎల్బీ శంకరరావు, కాసల నాగభూషణం


రాయదుర్గం విజయలక్ష్మి 'ఉపనిషద్వింశతి' పుస్తకావిష్కరణ

మూడు పుస్తకాల ఆవిష్కరణ...

ప్రారంభ సమావేశం అనంతరం ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షతన జరిగిన పుస్తకావిష్కరణలో మూడు పుస్తకాలను భువనచంద్ర ఆవిష్కరించారు. మొదటగా ఆచార్య ఎల్బీ శంకరరావు రచించిన 'ఎల్బియస్ రేడియో ప్రసంగాలు' (వ్యాస సంపుటి)ని వల్లా ప్రగడ స్రవంతి సమీక్షించారు. రెండో పుస్తకం డా.టీఆర్ఎస్ శర్మ రచించిన 'ఉపనిషద్వింశతి'ని డా.రాయదుర్గం విజయలక్ష్మి సమీక్షించారు. మూడో పుస్తకం డా.మాదా శంకరబాబు రచించిన 'ఈశా సాహితీ వ్యాసవాణి'ని డా.తిరుమల ఆముక్తమాల్యాద సమీక్షించారు.

ఉగాది పురస్కారం ప్రదానం...

వేడుకల్లో భాగంగా ప్రముఖ యోగా గురువు, యోగాలయ అధ్యక్షుడు డా.వాసిలి వసంతకుమార్‌కు మద్రాసు విశ్వవిద్యాలయం తరఫున ముఖ్యఅతిథి భువన చంద్ర ఉగాది పురస్కారాన్ని వసంతకుమార్‌కు అందజేశారు. అనంతరం జోస్యుల ఉమ 'సూర్యకాంతం ఇష్టావధానం', ఎస్పీ వసంతలక్ష్మి, దామెర్ల సరస్వతి 'జనాభా లెక్కల ఝలక్' అనే అంశాలతో అందించిన హాస్యామృతం శ్రోతలను ఆకట్టుకుంది. తెలుగు శాఖ అతిథి ఉపన్యాసకులు డా.మాదా శంకరా బాబు వందన సమర్పణతో ప్రారంభ కార్యక్రమం ముగిసింది.

కవి సమ్మేళనం...

మధ్యాహ్నం 1.30 గంటలకు నిర్వహించిన ఉగాది కవి సమ్మేళన సభకు ఎస్.శశికళ స్వాగతం పలుకగా, అధ్యక్షులు ఆచార్య విస్తాలి శంకరరావు ఉగాది కవితల ప్రాముఖ్యత తెలియజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డా.ఏవీ శివకుమారి... తెలుగు పండుగ ఉగాదిని విశ్వవిద్యాలయంలో జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. మదురై విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య జొన్నలగడ్డ వెంకటరమణ ప్రారంభోపన్యాసం అనంతరం నెల్లుట్ల శ్రీనివాసులు, మొరమూరి శేషాచారి సహా 78 మంది కవితలు చదివారు. చివరగా 'విశ్వావసు గానలహరి' (సంగీత కార్యక్రమం)లో ఎమ్మార్ సుబ్రహ్మణ్యం సారథ్యంలో అరుణా శ్రీనాథ్, నిడమర్తి వసుంధరాదేవి, వంజరపు శివయ్య, రవికుమార్, వల్లా ప్రగడ స్రవంతి, ఆచార్య విస్తాలి శంకరరావు ఆలపించిన సంగీతం శ్రోతలను వీనులవిందు గావించింది.


మాదా శంకరబాబు రచించిన 'ఈశా సాహితీ వ్యాసవాణి' పుస్తకావిష్కరణ

రంజాన్ మాసంలో ఆధ్యాత్మిక పరిమళం

● సుర్మా అత్తర్లు అమ్మకాలు స్పెషల్

ప్యారీస్, ఆంధ్రజ్యోతి

ముస్లింలు పవిత్రంగా భావించే రంజాన్ మాసంలో 'సుర్మా', 'అత్తర్లు' ఆద్యంతం ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతూ ప్రత్యేకత చాటుతున్నాయి. ఈ మాసంలో ముస్లింలు వయోభేదం లేకుండా త్రికరణ శుద్ధితో ఉపవాసం (రోజా)పాటిస్తూ 30 రోజులు పవిత్రగ్రంథం ఖురాన్ పఠిస్తూ ఐదుపూటలా నమాజ్ చేస్తున్నారు. మహ్మద్ ప్రవక్త బాటను అనుసరిస్తూ ఎంతో నిష్ఠగా వుంటున్నారు. ఈ క్రమంలో ఎంతో విశిష్ఠమైన రంజాన్ మాసంలో ముస్లింల నేత్రాలకు అలంకరించే 'సుర్మా'కు ఎంతో విశిష్ఠత వుంది. విధిగా కళ్లకు సుర్మా అలంకరించడం పవిత్ర కార్యంగా భావిస్తారు.



కళ్లకెంతో మేలు...

భక్తితో పాటు వైద్య పరిభాషలోనూ ఈ సుర్మాకు ఆరోగ్యప్రదాయినిగా పేరుంది. నేత్ర సంబంధ వ్యాధుల నివారణగా, వేసవి కాలంలో ఈ సుర్మా కళ్లకు చల్లగా ఉంచుతుంది. ఒక పవిత్ర రంజాన్ మాసంలో సుర్మా అత్తర్లు పూయడం ద్వారా గౌరవించే సంప్రదాయాన్ని ముస్లింలు కొనసాగిస్తున్నారు.



ఇది సుర్మా విశిష్ఠత...

నిత్యం అల్లా నామస్మరణలో గడిపే దైవప్రవక్త హజరత్ మూసా అలైహిసలా తుస్సలాంకు అల్లా ప్రసన్నం పొంది అతడిని అల్లా ఎక్కుడున్నాడో చూపించమని అతని అనునయులు కోరుతారు. దీంతో సిరియా, ఈజిప్టు ప్రాంతాలకు చెందిన పెద్దలను సమీపంలోని కోహితూర్ పర్వతం వద్దకు తీసుకెళ్తారు. అక్కడ ఒకసారి 'అల్లాహ్ నూర్' ప్రత్యేక్షం కావడం చూసి ఆశ్చర్యానికి గురవుతారు. అప్పుడే అల్లాహ్ మహిమతో కోహితూర్ పర్వతం భస్మమై బూడిద (చూర్ణం)గా మారుతుంది. దైవసంకల్పం కళ్లెదుట సాక్షాత్కారించడంతో భక్తి పారవశ్యంతో ఆ చూర్ణిన్ని వారు తమ కళ్లకు అద్దుకుంటారు. అప్పటినుండి కోహితూర్ పర్వతానికి చెందిన రాళ్ల చూర్ణమే క్రమంగా సుర్మాగా రూపాంతరం చెందిందని ముస్లింల ప్రగాఢ విశ్వాసం.







ఊపందుకున్న అమ్మకాలు...

రంజాన్ పండుగకు మరో రెండ్రోజులు మాత్రమే ఉన్న నేపథ్యంలో, అత్తర్లు, సుర్మా, టోపీలు, నూతన వస్త్రాల అమ్మకాలు ఊపందుకోవడంతో వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని హార్బర్ సమీపంలోని అంగప్పనాయక వీధి, మూర్‌స్ట్రీట్, లింగిశెట్టివీధి, తంబుశెట్టివీధి, మన్నడి ప్రాంతాల్లో పండుగకు అవసరమైన సరుకులతో పాటు రకరకాల అత్తర్లు అమ్మకాలకు సిద్ధంచేశారు. అదేవిధంగా పెరంబూరు సమీపంలోని పులియాన్‌తోపు, సెంట్రల్ రైల్వేస్టేష్ సమీపంలోని పెరియమెట్టు, ట్రిప్లికేన్, ఐస్ హౌస్, జామ్‌బజార్, రాయపేట, మైలాపూర్, వాషర్‌మెన్‌పేట, అడయార్, టినగర్ తదితర ప్రాంతాలు కొనుగోలుదారులతో కళకళలాడుతున్నాయి.

సీఐఐ-సౌత్ రీజియన్ చైర్మన్‌గా థామస్ జాన్ ముత్తూట్



అడయార్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) దక్షిణ ప్రాంతీయ విభాగం చైర్మన్‌గా ముత్తూట్ పచ్చప్పన్ గ్రూపు (ఎంపీజీ) అధినేత థామస్ జాన్ ముత్తూట్ ఎంపికయ్యారు. అలాగే, 2025-26 సంవత్సరానికిగాను కొత్త ఆఫీస్ బేరర్లను కూడా ఎన్నుకున్నారు. 137 సంవత్సరాలకు పైగా వారసత్వం కలిగిన విభిన్న వ్యాపార సమ్మేళనమైన ఎంపీజీకి థామస్ జాన్ ముత్తూట్ నాయకత్వం వహిస్తున్నారు. ఆయన సారథ్యంలో ఎంపీజీ గ్రూపు ఆర్థిక సేవలు, ఆతిథ్యం, రియల్ ఎస్టేట్, ఆటోమోటివ్, విద్యుత్ ఉత్పత్తి రంగాల్లో విస్తరించింది. ముత్తూట్ ఫిన్‌కార్ప్ లిమిటెడ్ చైర్మన్‌గా, మేనేజింగ్ డైరెక్టరుగా ఆయన దేశ వ్యాప్తంగా ఉన్న 3800 శాఖల నెట్‌వర్క్‌ను సమర్థమంతంగా పర్యవేక్షిస్తున్నారు. అలాగే, సీఐఐ సౌత్ రీజియన్ వైస్ చైర్మన్‌గా రవిచంద్రన్ పురుషోత్తమన్ ఎంపికయ్యారు. ఈయన డన్‌ఫోస్ ఇండియా రీజియన్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్నారు.

ఎస్కేపీసీలో ఘనంగా ఉగాది వేడుకలు


సంప్రదాయ వస్త్రధారణతో ఉగాదికి ఆహ్వానం పలుకుతున్న విద్యార్థినులు

● ఆటపాటలతో విద్యార్థినుల సందడి

ప్యారీస్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జిటౌన్‌లో ఎస్కేపీడీ చారిటీస్ నిర్వహణలోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆర్ట్స్ అండ్ సైన్స్ మహిళా కళాశాల (ఎస్కేపీసీ)లోని ఐక్యూఏసీ, తెలుగు విభాగం ఆధ్వర్యంలో విశ్వావసు నామ సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ శుక్రవారం ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. కళాశాల ప్రాంగణాన్ని పూలు, అరటి, మామిడి తోరణాలు, రంగవళ్లికలతో తీర్చిదిద్దారు. ప్రధాన వేదిక వద్ద బతుకమ్మను కొలువుదీర్చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంప్రదాయ వస్త్రధారణతో బతుకమ్మల చుట్టూ తిరిగి, విద్యార్థినులు అడుతూపాడుతూ సందడి చేశారు. కళాశాల కరస్పాండెంట్ ఊటుకూరి శరత్‌కుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకలు సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టాయి. ఈ వేడుకల్లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బందికి నిర్వాహకులు షడ్రుచుల ఉగాది పచ్చడి, ప్రసాదాలు పంపిణీ చేశారు.


బతుకమ్మ వేడుక

విదేశాలకు దీటుగా తమిళనాడు

● మూడేళ్లుగా 8 శాతం ఆర్థికాభివృద్ధి

● దేశాభివృద్ధిలో రాష్ట్రం కీలక భాగస్వామ్యం ● సీఐఐ సదస్సులో ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మిగతా రాష్ట్రాలతో తమిళనాడును పోల్చి చూడరాదని, అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోల్చి చూడాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఆధ్వర్యంలో 'భారతీయ నగరాల్లో జీవన పరిస్థితుల అభివృద్ధి' అనే అంశంపై శుక్రవారం నగరంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడుతూ... దేశాభివృద్ధిలో తమిళనాడు కీలక భాగస్వామిగా ఉందన్నారు. దేశంలో తమిళనాడు రెండవ అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా ఉందని తెలిపారు. దేశం మొత్తం ఉత్పత్తి రంగంలో రాష్ట్రం 12.11 శాతం వాటా కలిగి ఉందన్నారు. మూడేళ్లలో రాష్ట్రం 8 శాతం ఆర్థికాభివృద్ధి సాధించిందని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి విశిష్టమైనదని, 2030 నాటికి ఒక ట్రిలియన్ ఆర్థికాభివృద్ధి సాధించేలా లక్ష్యం నిర్ణయించుకొని, తదనుగుణంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఆర్థికాభివృద్ధి మాత్రమే కాకుండా అన్ని రంగాల అభివృద్ధి, సామాజిక న్యాయం, మహిళా సాధికారికత, సమానత్వం తదితరాల ప్రామాణికంగా అభివృద్ధి బాటలో పయనిస్తున్నామని తెలిపారు. అందువల్ల, మిగతా రాష్ట్రాలకు భిన్నంగా రాష్ట్రం ప్రత్యేకంగా రాణిస్తుందని తెలిపారు. దేశంలోనే అధికంగా కర్మాగారాలు రాష్ట్రంలోనే ఉన్నాయన్నారు. అన్ని నగరాలు అభివృద్ధి, మౌళిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కోయంబత్తూర్, తిరుచ్చి, హోసూరు, మదురై, సేలం, తూత్తుకుడి తదితర నగరాలు శక్తివంతమైన ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న నగరాలుగా పేరొందాయన్నారు. దేశంలోనే ఎలక్ట్రానిక్ ఉపకరణాల ఎగుమతుల్లో 37.1 శాతం రాష్ట్రంతో మొదటి స్థానంలో ఉందని ఇటీవల వెలువడిన గణాంకాల్లో తెలుస్తుందన్నారు. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేలా ప్రస్తుత బడ్జెట్‌లో నిధులు కేటాయించామన్నారు. రాష్ట్రంలో పచ్చదనం పెంచి, కాలుష్యరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, కర్మాగారాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత, అందిస్తున్న రాయితీలు, రాష్ట్రంలో కర్మాగారాలు ఏర్పాటు చేసే కలిగే లాభాలు తదితరాలను విదేశీ కంపెనీలకు తెలియజేసి, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా అందరూ కృషిచేయాలని ఈ సందర్భంగా సీఐఐకి ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.


ప్రత్యేక సావనీర్ ఆవిష్కరిస్తున్న సీఎం స్టాలిన్, అతిథులు, నిర్వాహకులు



తిరుమలలో 'రాబిన్‌హుడ్'

తిరుమల, మార్చి28(ఆంధ్రజ్యోతి): 'రాబిన్‌హుడ్' సినిమా హీరో నితిన్ శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తన సినిమా విడుదల సందర్భంగా శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులు తీసుకున్నట్లు చెప్పారు. ఈ సినిమాను అందరూ చూసి ఎంజాయ్ చేయాలని కోరారు. తన తర్వాత చిత్రం 'తమ్ముడు' మే లేదా జూన్ నెలలో విడుదల కానుందన్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డితో కలిసి వచ్చిన నితిన్‌కు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించగా, వేదపండితులు ఆశీర్వచనం చేశారు. ఆలయం ముందు నితిన్‌ను చూసేందుకు, సెల్ఫీల కోసం పలువురు ఉత్సాహం చూపారు.


సతీష్‌రెడ్డి


అశోక్‌బాబు


శ్రీనివాసన్

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. డీఆర్డీవో మాజీ చైర్మన్, ఏపీ శాస్త్ర సాంకేతిక సలహాదారు సతీష్‌రెడ్డి, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, ఎన్ఎస్జీ డీజీ బ్రిగు శ్రీనివాసన్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


శ్రీవారి సర్వదర్శనానికి 13 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 13 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 28 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.4.36 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 64,279

తలనీలాలు సమర్పించినవారు: 24,482



కమలనాథుల దర్శనం కోసం
కార్లు మార్చి వెళ్లారు

- ఎడప్పాడిపై ఉదయనిధి వ్యంగ్యాస్త్రాలు
- రెండు నగరాల్లో హాకీ పోటీలు

అడయార్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): హస్తినలోని బీజేపీ అగ్రనేతలను కలుసుకునేందుకు మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె.పళనిస్వామి మూడు కార్లు మార్చి మార్చి వెళ్లారంటూ ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. దీంతో శుక్రవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో కొద్దిసేపు సభ్యులంతా సరదాగా మాట్లాడుకున్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా శుక్రవారం జరిగిన సభా కార్యక్రమాల్లో యువజన క్రీడలు, అభివృద్ధి తదితర శాఖల అనుబంధ పద్దులపై చర్చ జరిగింది. ఇందులో ఆ శాఖామంత్రి, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి మాట్లాడుతూ.. 'ఏదో మునిగిపోయినట్టుగా, హుటాహుటిన సభ నుంచి విపక్ష నేత ఎడప్పాడి, ఆ పార్టీ సభ్యులు వెళ్లిపోయారన్నారు. గత రెండేళ్ళుగా తన శాఖకు చెందిన అనుబంధ పద్దులపై సభ్యులు అడిగిన అనేక ప్రశ్నలకు సమాధానాలు చెప్పానన్నారు. అయితే శాసనసభ ముగింపు రోజున ప్రతిపక్ష నేత ఎడప్పాడి సభ నుంచి బయటకు వెళ్ళి పొరపాటున తన కారెక్కేందుకు ప్రయత్నించారన్నారు. ఈ విషయంపై ఇపుడు ఇక్కడ ప్రస్తావించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎడప్పాడి ఆయన కారు తీసుకెళ్ళడంలో తనకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. కానీ, ఆ కారులో దారితప్పి బీజేపీ కార్యాలయానికి వెళ్ళకూడదన్నారు. దీంతో సభలో ఒక్కసారిగా నవ్వులు పూశాయి. వెంటనే మాజీ సీఎం ఈపీఎస్ కలుగజేసుకుని తమ కారు దారి తప్పదన్నారు. దీనికి డిప్యూటీ సీఎం ఉదయనిధి మాట్లాడుతూ, రెండు రోజుల క్రితం ఈపీఎస్ అన్నాడీఎంకే నూతన కార్యాలయ నిర్మాణ పనులను చూసేందుకు ఢిల్లీ వెళ్ళినట్టుగా చెప్పారన్నారు. కానీ, ఎడప్పాడి అలా చెప్పిన కొన్ని నిమిషాల్లోనే మూడు కార్లు మారిమారి బీజేపీ కార్యాలయానికి చేరుకున్నారని తెలిపారు. గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో క్రీడాకారులకు మూడు శాతం రిజర్వేషన్లు కల్పించినట్టు ఆ పార్టీ నేతలు చెబుతున్నారన్నారు. కానీ, గత పదేళ్ళ కాలంలో కేవలం ముగ్గురికు మాత్రమే ఉద్యోగావకాశాలు కల్పించారన్నారు. ఎంకే స్టాలిన్ సారథ్యంలోని డీఎంకే ప్రభుత్వం 104 మంది క్రీడాకారులకు ఉపాధి అవకాశం కల్పించిందన్నారు. గత నాలుగేళ్ళ కాలంలో 1821 మంది క్రీడాకారులకు రూ.60,014 కోట్ల విలువ చేసే ప్రోత్సాహకాలను అందజేశామన్నారు.


అసెంబ్లీలో ప్రసంగిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

రాష్ట్రంలో ఇంటర్నేషనల్ హాకీ పోటీలు

చెన్నై, మదురైలో అంతర్జాతీయ హాకీ పోటీలను నిర్వహిస్తామని ఉదయనిధి తెలిపారు. ఈ పోటీల నిర్వహణ కోసం రూ.55 కోట్లు ఖర్చు చేస్తామన్నారు. ఇందులో 24 దేశాలు పాల్గొంటాయని మొత్తం 72 పోటీలను నిర్వహిస్తామన్నారు. అలాగే, ముఖ్యమంత్రి క్రీడోత్సవాలను అన్ని విభాగాల్లో రూ.45 కోట్లతో నిర్వహిస్తామన్నారు. అన్ని జిల్లాల్లో ఉన్నత సౌకర్యాలతో కూడిన క్రీడా మైదానాలను నిర్మిస్తామన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు శిక్షణ సమయంలో గాయపడుతుంటారని, ఇలాంటి వారికి వైద్య ఖర్చుల కోసం ఆరోగ్య బీమా సదుపాయాన్ని కల్పించామన్నారు. తిరువళ్ళూర్, తిరువణ్ణామలై, తంజావూరు, దిండిగల్, కృష్ణగిరి జిల్లాల్లో పారా క్రీడా మైదానాలను నిర్మిస్తామన్నారు. వేళచ్చేరిలోని స్విమ్మింగ్‌పూల్‌ను రూ.18 కోట్లతో ఆధునికీకరిస్తామన్నారు. 40 అసెంబ్లీ స్థానాల్లో సీఎం స్పోర్ట్స్ మినీ మైదానాలను నిర్మిస్తామని వెల్లడించారు. చెన్నై నగరంలో ఈ యేడాది ఆఖరులో మళ్ళీ స్క్వాష్ అంతర్జాయ పోటీలను నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం ఉదయనిధి వెల్లడించారు.

జీసీసీలో నాలుగు వార్డుల ఖాళీ

మే నెలాఖరులో ఎన్నికలకు ఈసీ సమాయత్తం

పెరంబూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ)లో ఖాళీగా ఉన్న నాలుగు వార్డులకు మేలో ఎన్నికలు జరుగనున్నాయి. రాష్ట్రంలో డీఎంకే అధికారం చేపట్టిన తర్వాత 2022 ఫిబ్రవరి 19న జీసీసీతో పాటు స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించారు. జీసీసీ పరిధిలోని 200 వార్డుల్లో అధిక స్థానాలు కైవసం చేసుకున్న డీఎంకే, మేయర్, ఉప మేయర్ పదవులు కైవసం చేసుకుంది. ఎన్నికలు ముగిసిన కొద్ది నెలల్లోనే 165వ వార్డు కాంగ్రెస్ కార్పొరేటర్ నాంజిల్ ఈశ్వర ప్రసాద్ మృతిచెందారు. అనంతరం 2023లో 59వ వార్డు డీఎంకే కార్పొరేటర్ కె.సరస్వతి, 122వ వార్డు డీఎంకే కార్పొరేటర్ షీబా మృతిచెందారు. 2024 ఆగస్టు 7న 146వ వార్డు డీఎంకే కార్పొరేటర్ ఆలంపాక్కం కె.షణ్ముగం మృతిచెందారు. దీంతో జీసీసీ పరిధిలో నాలుగు వార్డులు ఖాళీగా ఉన్నాయని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ నాలుగు వార్డుల్లో అధికారులు అభివృద్ధి, పర్యవేక్షణ పనులు చేపట్టారు. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ప్రతినిధుల పదవీకాలం 2026వ సంవత్సరంతో ముగియనుంది. 18 నెలల్లో పదవీకాలం ముగుస్తున్న స్థానిక సంస్థల్లో ఖాళీ స్థానాలకు మే నెలలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఎన్నికలు జరుగనున్న జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో శుక్రవారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి జ్యోతి నిర్మల వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం కానున్నారు.

శాసనసభ సమావేశాల అనంతరం...

రాష్ట్ర శాసనసభ సమావేశాలు ఏప్రిల్ 30వ తేదీతో ముగియనున్న తర్వాత, స్థానిక సంస్థల ఎన్నికల తేదీ ప్రకటించనున్నారు. సాధారణ ఎన్నికలల్లాగే ఈ ఎన్నికలకు 25 రోజులు సమయం ఉంటుంది. నామినేషన్ల దాఖలు, ఉపసంహరణ, పోటీలో ఉన్న తుది అభ్యర్థుల జాబితా తదితరాలు పూర్తిచేసి మే నెలాఖరులో ఎన్నికలు జరుగనున్నాయి.

జీసీసీలో రెండు స్థానాలు మహిళలకే...

జీసీసీలో ఖాళీగా ఉన్న నాలుగు స్థానాల్లో మూడు స్థానాలు డీఎంకే, ఒక స్థానంలో కాంగ్రెస్ గెలుపొందింది. ఆ ప్రకారం, డీఎంకే పోటీచేయనున్న మూడు వార్డుల్లో రెండు వార్డులు మహిళలకు దక్కనున్నాయి. కాగా, ఎన్నికల్లో పోటీచేసేందుకు పలువురు నేతలు ఆసక్తి చూపుతున్నారు. మే నెలలో ఎండలు అధికంగా ఉండే పరిస్థితుల్లో, ఎన్నికల ప్రచారం కూడా వేడిగా ఉండే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

స్తంభం తాకితే
రూ.1,000 జరిమానా

- మదురై తిరుమల నాయకర్ మహల్ నిర్వాహకుల హెచ్చరిక



పెరంబూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మదురై తిరుమల నాయకర్ మహల్ స్తంభాలు, గోడలు తాకితే రూ.1,000 జరిమానా విధిస్తామని మహల్ నిర్వాహకులు ప్రకటించారు. మహల్ ముందు భాగంలోని దర్బార్ హాల్ ఫ్లోర్, సైడ్ కారిడార్ల ఫ్లోర్లను యధాతథంగా పునరుద్ధరించారు. రాజు తిరుమల నాయకర్ చరిత్రపై కొత్త లేజర్ లైటింగ్ షో మే నెలలో ఏర్పాటుచేయనున్నట్లు మంత్రి రాజేంద్రన్ ప్రకటించారు. అందువల్ల దర్బార్ హాల్ స్తంభాల సమీపంలో సౌండ్, లైటింగ్ డిస్‌ప్లే ఏర్పాటుకు సంబంధించి వైరింగ్ జరుగుతోంది.. స్తంభాలకు పెయింట్ వర్క్ పూర్తయిన నేపథ్యంలో, దర్బార్ హాల్ మాత్రమే సందర్శించేందుకు పర్యాటకులను అనుమతిస్తున్నారు. లోపలి భాగంలో విద్యుత్ సభ, శయన మందిరం ప్రాంతంలో పనులు ఇంకా పూర్తికాలేదు. 2023లో ప్రారంభమైన పనులు 2024 నవంబరులో పూర్తిచేయాల్సి ఉంది. ఈ రెండు ప్రాంతాలు వర్షం కారణంగా బాగా దెబ్బతినడంతో, పునరుద్ధరించేందుకు ఆరు నెలలు పట్టింది. తదుపరి విద్యుత్ సభ మార్గంలోని 24 గుండ్రటి స్తంభాలు పునరుద్ధరించి గోడలకు కూడా ఎరుపు రంగు వేశారు. స్తంభాలపై దుమ్ము, ధూళి పడకుండా ప్లాస్టిక్ కవర్లతో పూర్తిగా కప్పారు. విద్యుత్ సభలోని 12 స్తంభాల దిగువ ప్రాంతాల్లో లైటింగ్ కోసం వైరింగ్ పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం మహల్‌లోని పురాతన రాతి విగ్రహాలను కప్పి ఉంచారు. విగ్రహాలకు ప్రత్యేక కేంద్రం ఏర్పాటుచేయనున్నారు. ఈ పనులు పూర్తయన తర్వాత గ్రంథాలయం పునరుద్ధరించనున్నారు. మూడు నెలల్లో మహల్ సందర్శకుల కోసం పూర్తిగా సిద్ధం కానుంది. రూ.10 కోట్లతో చేపడుతున్న పునరుద్ధరణ పనుల కారణంగా స్తంభాలు, గోడలను సందర్శకులు తాకితే రూ.1,000 జరిమానా విధిస్తామని, ఇందుకోసం అదనపు సీసీ కెమెరాలు ఏర్పాటుచేసినట్లు మహల్ నిర్వాహకులు తెలిపారు.

'ఎర్ర'స్మగ్లర్ శివమణిపై పీడీ యాక్టు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 28(ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు చెందిన ఎర్రచందనం స్మగ్లర్ శివమణిపై పీడీ యాక్టు నమోదు చేయాలని ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. తమిళనాడు తిరువణ్ణామలై జిల్లా నల్లపట్టు గ్రామానికి చెందిన శివమణి అలియాస్ శివమణి గోవిందన్ శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తున్నాడు. ఇతనిపై చాలా కేసులు ఉండడంతో పీడీ యాక్టు నమోదుకు టాస్క్‌ఫోర్సు అధికారులు కలెక్టర్‌కు లేఖ రాశారు. పరిశీలించిన కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.


పోలేరమ్మ వెళ్లనంపు గ్రామోత్సవం


ఊరేగింపులో గణాచారి, ఈవో నవీన్‌కుమార్ తదితరులు

- ఘనంగా పోలేరమ్మ వెళ్లనంపు గ్రామోత్సవం
- ముగిసిన ముత్యాలమ్మ జాతర

అక్కా.. పోయి వస్తానే..!

చిల్లకూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): 'అక్కా.. పోయి వస్తానే. మళ్లీ వచ్చే ఏడాది వస్తానే..' అంటూ పోలేరమ్మ తన సోదరి ముత్యాలమ్మకు చెప్పి నిమజ్జనానికి బయలుదేరగా, భక్తులు చీరలు పరిచి సాగిలి పడి సాగనంపారు. ముత్యాలమ్మ జాతరలో ఆఖరి ఘట్టమైన 'పోలేరమ్మ వెళ్లనంపు' కార్యక్రమం శుక్రవారం వైభవంగా జరిగింది. చిల్లకూరు మండలం తూర్పుకనుపూరులో నాలుగురోజులు పాటు వైభవంగా జరిగిన జాతర శుక్రవారంతో ముగిసింది. గంగమిట్ట మీద కొలువుతీరిన పోలేరమ్మకు వేకువజామున కుంభం పోసి, నైవేద్యం సమర్పించారు. అనంతరం పోలేరమ్మ జాతర ముగుస్తున్నట్లు గణాచారి ప్రకటించారు. ఆ తర్వాత పోలేరమ్మ విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. కార్యక్రమం ప్రారంభంకాగానే బాణసంచా పేల్చగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. వీధులలో మహిళలు చీరలు పరిచి అమ్మవారిని చీరలపై సాగనంపారు. కోరుకున్న కోర్కెలు తీర్చాలంటూ మహిళలు పూజలు చేశారు. పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించాక పోలేరమ్మ తన సోదరి ముత్యాలమ్మను అక్కా వెళ్లివస్తానంటూ పలకరించే సన్నివేశం భక్తులను ఆకట్టుకుంది. ముత్యాలమ్మ ఆలయంలో పోలేరమ్మ విగ్రహాన్ని ఉంచి గణాచారి ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఊరి చివర మైదానంలోకి పోలేరమ్మ విగ్రహాన్ని తీసుకెళ్లి అక్కడ పంబలోళ్లు డప్పు వాయిస్తుండగా.. ఆసాదులు పోలేరమ్మ కథను భక్తులకు వినిపించారు. ఆమెకు ఇష్టమైన బూతు పురాణాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా మహిళలకు అమ్మవారి పూనకం వచ్చి, చిందులు వేస్తూ వచ్చే ఏడాది వస్తానంటూ చెబుతారు. ఆ మహిళలపై గణాచారి పసుపునీళ్లు చల్లి దీవెనలు అందించడంతో జాతర ముగిసింది. ఆలయ ఈవో నవీన్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించగా, డీఎస్పీ గీతాకుమారి బందోబస్తు నిర్వహించారు. ఇక, జాతర ముగియడంతో భక్తులు ఒక్కసారిగా వెనుదిరగడంతో రద్దీ నెలకొంది. తూర్పుకనుపూరులో తిరుగు ప్రయాణమయ్యే జనంతో పోటెత్తిపోయింది. వాహనాలు వరుసక్రమంలో బారులు తీరడంతో పలు చోట్ల రాకపోకలు ఆగాయి. కాగా, ముత్యాలమ్మ జాతర సందర్భంగా హుండీ శుక్రవారం హుండీ లెక్కించగా మొత్తం రూ.64,46,838 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. అదే గతేడాది రూ.53,60,973 వచ్చిందన్నారు. గతేడాది కంటే రూ.11,14,135 పెరిగింది.


జాతర నుంచి తిరిగి గ్రామాలకు వెళ్లేందుకు బస్సుల కోసం వేచివున్న భక్తులు

మే నుంచి నగరంలో
625 ఎలక్ట్రికల్ బస్సులు

- అందులో కూడా మహిళలకు ఉచిత ప్రయాణం

పెరంబూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నైలో త్వరలో 625 ఎలక్ట్రికల్ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. ఈ విషయమై రవాణా శాఖ అధికారులు మాట్లాడుతూ... జర్మన్ బ్యాంక్ ఆర్థిక సాయంతో మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) ఎలక్ట్రికల్ బస్సులకు టెండర్లు ఆహ్వానించిందన్నారు. ఆ ప్రకారం, తొలివిడతగా ఏసీ, నాన్ ఏసీ కలిపి 625 బస్సులు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. వీటిలో దివ్యాంగుల సీటు సహా 35 సీట్లుంటాయన్నారు. ఈ బస్సులకు చార్జింగ్ చేసేలా అడయార్, అయనావరం సహా ఐదు డిపోలను ఆధునికీకరించనున్నామని తెలిపారు. డ్రైవర్, నిర్వహణ పనులను సదరు కంపెనీ చూసుకుంటుండగా, ఎంటీసీకి చెందిన కండక్టర్ మాత్రమే విధుల్లో ఉంటారన్నారు. ఈ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఉంటుందన్నారు. లోఫ్లోర్ బస్సులు కావడంతో వృద్ధులు కూడా సులభంగా ఎక్కేందుకు వీలుందన్నారు. ఈ బస్సులు ప్రస్తుతం ఎంటీసీ తనిఖీల్లో ఉన్నాయని. ఆమోదం లభించిన వెంటనే మే నుంచి ఈ బస్సులు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయని అధికారులు తెలిపారు.


అందుబాటులోకి రానున్న ఏసీ ఎలక్ట్రికల్ బస్సు

ప్రశాంతంగా
టెన్త్ పరీక్షలు ప్రారంభం

చెన్నై, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో టెన్త్ పబ్లిక్ పరీక్షలు శుక్రవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 15వ తేది వరకు జరుగనున్న ఈ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 9.13 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 12,480 పాఠశాలల్లో చదువుతున్న 4,46,411 మంది విద్యార్థులు, 4,40,465 మంది విద్యార్థినులు, 25,888 మంది ప్రైవేటు అభ్యర్థులు, 272 మంది ఖైదీలు. 15,729 మంది దివ్యాంగులు ఈ పరీక్షలు రాస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటుచేసిన 4,113 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 10 గంటలకు పరీక్ష ప్రారంభమైంది. పరీక్షల్లో ఎలాంటి అవకతవకలు జరుగకుండా 48,426 మంది పరీక్షా కేంద్ర ఇన్విజిలేటర్లు, 4,858 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకెళ్లనివ్వలేదు. విద్యార్థులు ప్రశ్నాపత్రం చదవడం, తమ స్వీయ వివరాలు పూర్తిచేసేందుకు సమయం కేటాయించారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, టాయిలెట్ వసతితో పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు చేపట్టారు.


విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి అన్బిల్ మహేష్


పరీక్ష రాస్తున్న విద్యార్థులు